ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జనగామ
ఆదివారం 26 సెప్టెంబరు 2025
5

- కాక రేపిన కాంగ్రెస్ అంతర్గత కలహాలు
- సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి కొండా సురేఖ బహిరంగ క్షమాపణలతో లొల్లికి తెర
- చిచ్చు రేపిన మేడారం టెండర్లు, మాజీ ఓఎస్డీ సుమంత్ అరెస్టు యత్నాలు
- సీఎం, మంత్రులపై కొండా దంపతుల కుమార్తె వ్యాఖ్యలతో మరింత ఆజ్యం
- సయోధ్య నెరిపిన టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి
- ఓరుగల్లు ఎమ్మెల్యేలతో మాత్రం విభేదాలు కంటిన్యూ



విభేదాలకు తెర పడినట్టేనా!?

వరంగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్‌లో సీఎం, మంత్రులతో కొండా దంపతులకు ఏర్పడిన విభేదాలు మంత్రి సురేఖ క్షమాపణలతో ఇక ముగిసినట్టేనా.. అనే చర్చ జరుగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డితో ఏర్పడిన విభేదాలపై రెండు రోజుల క్రితం కేబినెట్ మీటింగ్ అనంతరం మంత్రి సురేఖ వివరించారు. సీఎంకు క్షమాపణలు చెపుతున్నట్లుగా ప్రకటించారు. తమ కుమార్తె వ్యాఖ్యల పై విచారం వ్యక్తం చేశారు. దీంతో వివాదం ముగిసిందనే చర్చ నెలకొంది. అయితే సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి, వేం నరేందర్‌రెడ్డితోపాటు పలువురిపై చేసిన వ్యాఖ్య లు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. మేడారం టెండర్ల విషయంలో దేవాదాయశాఖకు సం బంధించిన రూ.101కోట్ల పనులను మంత్రి పొం గులేటి శ్రీనివాస్‌రెడ్డి తనకు తెలియకుండానే తన సొంత కంపెనీలకు కాంట్రాక్టులు ఇప్పించుకున్నారని సురేఖ.. సీ ఎం రేవంత్‌రెడ్డితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వివాదం చెలరేగటం తో మరుసటి రోజు మేడా రం జాతర అభివృద్ధి పనులపై జరిగిన సమీక్షకు సురేఖ లేకుండానే మంత్రులు పొంగులేటి, సీతక్కలు నిర్వహించారు. దీంతో ఆగ్రహంగా ఉన్న మంత్రి కొండా సురేఖ.. అక్టోబరు 15న నర్సంపేట ఎమ్మె ల్యే మాధవరెడ్డిని పరామర్శించేందుకు వరంగల్‌కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు దూరంగా ఉండడం చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం మేడారానికిసంబంధించి దేవాదాయశాఖకు కేటాయించిన రూ.101కోట్ల పనులను రద్దు చేసి, ఆర్‌అండ్‌బీకి కేటాయించారు. దీనికి తోడు మంత్రి కొండా సురేఖ ఓఎస్‌డీగా ఉన్న సుమంత్‌ను ఆ పదవిని ప్రభుత్వం తొలగించింది. వీటితో మనస్తాపంతో ఉన్న మంత్రి కొండా సురేఖ ఇంటికి మాజీ ఓఎస్‌డీ సుమంత్‌ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు రావడం వివాదానికి మరింత ఆజ్యం పోసింది. హైదరాబాద్‌లోని మంత్రి కొండా సురేఖ ఇంటి వద్ద పోలీసులతో మంత్రి కుమార్తె సుష్మితాపటేల్ వాగ్వాదానికి దిగటం, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డిలపై అనుచి తవ్యాఖ్య లు చేయటం రాష్ట్ర వ్యాప్తంగా సం చనలంగా మారింది. ఈ వివాదం నేపథ్యంలో కేబినెట్ సమావేశానికి సురేఖ దూరంగా ఉండటం పలు ఊ హాగానాలకు దారితీసింది. సీఎంతో మంత్రి సురేఖకు విభే దాలు ఏర్పడ్డాయనే చర్చ జరిగింది. ఉమ్మడి వరంగల్‌కు చెందిన ఓ నాయకుడు కొండా దంపతులను టార్గెట్ చేశారనే చర్చ జరిగింది. సీఎంకు సమాచారం లేకుండా సదరు నాయకుడు అధికారులకు, పోలీసులకు ఆదేశాలు జారీ చే సి వివాదానికి కారణమయ్యారనే చర్చ కూడా జరిగింది. ఈ పరిణామల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్‌లో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి దీపావళి రోజున మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావులు సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. జరిగిన పరిస్థితులపై సీఎంకు కొండా దంపతులు వివరించారు. దీంతో సీఎం కు, కొండా దంపతులకు మధ్య ఉన్న విభేదాలు తొలిగిపోయాయనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. అయితే అనూహ్యంగా గురువారం మంత్రి కొండా సురేఖ మీడి యా ముందు సీఎంకు క్షమాపణలు చెప్పడంతో సమస్య సద్దుమణిగినట్టేననే చర్చ జరుగుతోంది. అయితే సుష్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలపై మాత్రం సురేఖ ఎలాంటి కామెంట్ చేయకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో ఉన్న విభేదాలు పరిష్కారం అయ్యాయనుకున్నప్పటికీ ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కీలక నేతలతో ఉన్న విభేదాలు మాత్రం కొనసాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పరకాల, స్టేషన్‌ఘనపూర్, వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, భూపాలపల్లి ఎమ్మెల్యేలతో కొండా దంపతులకు విభేదాలు ఉన్నాయి. అలాగే నర్సంపేట ఎమ్మెల్యేతో మొదటి నుంచి రాజకీయ వైరం కొనసాగుతోంది. మంత్రి, ఎమ్మెల్యేల మధ్య విభేదాలు ఏఐసీసీ నేతల వరకు వెళ్లింది. సీఎం, మంత్రి పొంగులేటి, ఇతరులతో విభేదాలకు ఫుల్‌స్టాప్ పడినట్లుగానే.. ఉ మ్మడి జిల్లా ఎమ్మెల్యేల తో ఉన్న విభేదాలకు బ్రేక్‌వేసేలా కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టిసారించాలని కార్యకర్తలు కోరుతున్నారు. వీరి మధ్య విభేదాలతో ద్వితీయశ్రేణి నేతలకు పదవులు రా కుండా అడ్డుపడుతున్నాయనే భావన నెలకొంది. జనవరి 27న ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక మండలిని ప్రభుత్వం ప్రకటించింది. అయితే మంత్రి, ఎ మ్మెల్యేల మధ్య విభేదాలతో ఇప్పటి వరకు ఆ పాలక వర్గం ప్రమాణ స్వీకారం కూడా చేయకుండానే రద్దు అయింది.

కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమాలను ముమ్మరం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

జనగామ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమాలను ఉధృతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, అల్ ఇండియా కిసాన్ సభ కేంద్ర కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పత్తి రైతుల రాష్ట్ర సదస్సును జనగామ జిల్లా కేంద్రంలోని కామాక్షి ఫంక్షన్ హాల్లో శనివారం సంఘ రాష్ట కన్వీనర్ పుచ్చకాయల కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా రంగారెడ్డి హాజరై మాట్లాడారు. కపాస్ యాప్ అమలు ద్వారా రైతులకు ఎలాంటి ఉపయోగంలేదని, కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ మెడలను వంచి రైతు వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకునే విధంగా ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట కో కన్వీనర్లు మూడ్ శోభన్, భూక్య చందు నాయక్, నాయకులు మంగ బీరయ్య, చిలుకూరి రాము, వాంకుడోత్ కోబల్‌నికాచారి, రామన్న తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న పూజారులు

కన్నుల పండువగా వేంకన్న వార కల్యాణం

చిలుపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వార కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించారు. శనివారం చేపట్టిన కల్యాణ మహోత్సవానికి దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఈవో భాగం లక్ష్మీప్రసన్న కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలతో పాటు, ప్రత్యేక పూలమాలలను సమర్పిం చారు. వేడుకలకు హాజరైన భక్తుల సమక్షంలో పూజారులు రవీందర్ శర్మ, రంగాచార్యులు వేదమంత్రాలనాలపించి కల్యాణం జరిపించారు. దీంతో ఆలయ ఆవరణంతా భక్తజన సందోహంతో నిండిపోయింది. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మోహన్, ధర్మకర్తలు రత్నాకర్‌రెడ్డి, గోలి రాజశేఖర్, గనగోని రమేష్, వెంకటేశ్వర్లు, పుల్యాల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరుకు చెందిన పద్మజ - కోటేశ్వర్‌రావు దంపతులు అన్నదానం చేశారు.

నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలి



డీఐఈవోను సత్కారిస్తున్న ఒకేషనల్ ఒప్పంద అధ్యాపకులు

జనగామ కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడాలని జిల్లా ఇంటర్ విద్యా శాఖ అధికారి(డీఐఈవో) కల్లూరి జితేందర్‌రెడ్డి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని డీఐఈవో కార్యాలయంలో శనివారం ఒకేషనల్ ఒప్పంద అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఐఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిల్లా శంకర్, రవి ప్రసాద్‌లు మాట్లాడుతూ ఒకేషనల్‌లో చదివిన విద్యార్థులు ఇటీవల గ్రూప్ వన్ ఆఫీసర్లుగా నిలిచారని పేద విద్యార్థులను తీర్చిదిద్దడంలో గత రెండు దశాబ్దాలుగా కష్టపడుతున్న తాము రెగ్యులరైజేషన్‌కు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం డీఐఈవో మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ అంకితభావంతో విద్యను అందించాలన్నారు.నిస్వార్థమైన సేవ ప్రతి ఒక్కరిని జీవితంలో ఉన్నతంగా నిలబెడుతుందన్నారు. అనంతరం ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు గ్రహీత దేవరుప్పుల ప్రిన్సిపాల్, డీఐఈవో జితేందర్‌ను శాలువతో ఘనంగా సత్కారించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముంజాల భిక్షపతి గౌడ్

పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలి

ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతి

ములుగు రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్ష పతి గౌడ్ డిమాండ్ చేశారు. ములుగు మండలంలోని ఇంచర్ల గ్రామంలోని అంబేద్కర్‌నగర్‌లో ప్రజా సంఘాల నాయకురాలు మల్లేశ్వరి అధ్యక్షతన శనివారం జరిగిన గుడిసె వాసుల సమావేశంలో భిక్షపతి మాట్లాడారు. గుడిసె వాసులు తమ ఆవాసాలను కూలగొట్టి ఏడాది గడిచినప్పటికీ వారికి ఇంత వరకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయలేదని విమర్శించారు. దీంతో వారికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటికైనా యంత్రాంగం స్పందించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉపాధ్యాయురాలి కుటుంబానికి చేయూత

కాటారం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని విలాసాగర్ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు, టీఎస్ పీఆర్టీయూ క్రియాశీలక సభ్యురాలు పద్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబానికి ఆ సంఘం నేతలు చేయూతను అందించారు. పీఆర్టీయూ సంక్షేమ నిధి నుంచి రూ. లక్ష ఆర్థిక సాయం చేశారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వాణి పాకల గ్రామంలో టీచర్ పద్మ పెద్ద కర్మ శనివారం జరగ్గా పీఆర్‌టీయూ కాటారం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్, తిరుపతి పాల్గొని చెక్కును అందించారు. మృతి చెందిన ఉపాధ్యాయురాలు పద్మ కుటుంబానికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు ఇప్పించే బాధ్యతను పీఆర్‌టీయూ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేగూరి సుభాకర్‌రెడ్డి, కుసునపు కిరణ్‌కుమార్ తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నడిపెల్లి సురేష్‌రావు, రాజశేఖర్, గణపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య

వాజేడు, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. ములుగు జిల్లా వాజేడు మండలం టేకులగూడెంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన శనివారం పరిశీలించారు. టేకులగూడెంలో 106 ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. వాటి నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయో పరిశీలించిన వీరయ్య అవి ఎప్పటిలోగా పూర్తవుతాయని అధికారులను ఆరా తీశారు. ఇళ్లకు సంబంధించిన బిల్లులు అకౌంట్లలో జమ అవుతున్నాయా.. లేదా? అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు ఇంకెవరికైనా మంజూరు కాకపోతే వారి వివరాలను సమర్పించాలని సంబంధించిన అధికారులకు సూచించారు. మండలంలో పర్యటించిన వీరయ్యకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఘనం గా స్వాగతం పలికారు. ఎఫ్‌డీవో ద్వాలియా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. బోగత జలపాతం అభివృద్ధిపై ఆయనతో వీరయ్య చర్చించారు.



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పొదెం వీరయ్య

నూగూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పూనెం రాంబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లే డేనార్జున్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాద బాబురాజు, ఎంపీడీవో విజయ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎఫ్‌ఆర్వో చంద్రమౌళి, ఆర్‌ఐ కురమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

రామప్ప శిల్పకళా నైపుణ్యం అద్భుతం

త్రిపుర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ హేమంత్‌వర్మ

వెంకటాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రామప్ప దేవాలయం శిల్పకళా నైపుణ్యం అద్భుతంగా ఉందని త్రిపుర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ హేమంత్‌వర్మ అన్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయాన్ని శనివారం హేమంత్‌వర్మ దంపతుల శనివారం సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని వార దర్శించుకోగా పూజారులు హరీష్‌శర్మ, ఉమాశంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం గైడ్ విజయ్ కుమార్ రామప్ప చరిత్రను వారికి వివరించారు. ఈసందర్భంగా హేమంత్‌వర్మ మాట్లాడుతూ యునెస్కో గౌరవం దక్కిన రామప్ప రాతిపై చెక్కిన ఇక్కడి శిల్పాల్లో జీవకళ ఉట్టిపడుతోందని అన్నారు. చరిత్ర భవిష్యత్ తరాలకు ఎన్నో అంశాలను తెలియజేస్తోందని పేర్కొన్నారు. జీవకళ ఉన్న శిల్ప కళాకృతులకు మరో రూపమే రామప్ప అని కితాబిచ్చారు. ఎంతో ఘన చరిత్ర గల రామప్పను సందర్శించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ హెచ్ఆర్‌డీ ప్రభాకర్, డీఈ ఆపరేషన్ ములుగు పులుసం నాగేశ్వర్‌రావు, ఏడీఈ వేణుగోపాల్, విజిలెన్స్ ఎస్సై పురుషోత్తం, ఏఈలు రమేష్, కిషోర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



రామప్పలోని శిల్పాలను పరీక్షిస్తున్న హేమంత్‌వర్మ



సమీక్ష సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

పొరపాట్లు లేకుండా పరిశీలన పూర్తి చేయాలి

● వీసీ ద్వారా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి

జనగామ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ను పూర్తి చేయాలని వీసీ ద్వారా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం హైదరాబాద్ రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేశ్ కుమార్, సంబంధిత అధికారులతో కలిసి చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీసీ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. జనగామ కలెక్టరేట్ కార్యాలయం నుంచి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాలో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 3 కోట్ల 33 లక్షల ఓటర్లను మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ను ఎలాంటి పొరపాట్లు లేకుండా దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఓటరు జాబితా మ్యాపింగ్ పూర్తి చేస్తాం

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈఆర్‌వో కార్యాలయంలో ప్రత్యేకంగా బూత్ స్థాయి అధికారులను కేటాయించి, ఓటరు జాబితా మ్యాపింగ్‌ను త్వరితగతిన పూర్తి చేస్తామని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అంశంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి, అదనపు ఎన్నికల అధికారి లోకేష్‌కుమార్ హైదరాబాద్ నుంచి శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పకడ్బందీగా చేపట్టాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌శర్మ

ఎస్ఐఆర్‌తో 2025 స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియపై బూత్ స్థాయి అధికారులు చేస్తున్న ప్రక్రియను రిటర్నింగ్ అధికారులు పర్యవేస్తూ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో స్థాయిలో 2002 ఎస్ఐఆర్ డేటాను 2025 ఎస్ఐఆర్ డేటాతో పరిశీలన చేయాలన్నారు. ఈ రెండు జాబితాలలో కామన్‌గా ఉన్న పేర్లు మినహాయించి 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ధ్రువీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో భాగంగా కేటగిరీ-ఏను బీఎల్‌వో యాప్ ద్వారా ధ్రువీకరిస్తారని, కేటగిరీ 'సీ' డీ' లింక్ ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ఈఆర్‌వో కార్యాలయంలో ప్రత్యేకంగా బూత్‌స్థాయి అధికారులను కేటాయించి త్వరితగతిన మ్యాపింగ్ పూర్తిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో రవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

సామాజిక దృక్పథం కలిగి ఉండాలి

ములుగు కలెక్టర్ దివాకర

ఏటూరునాగారం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక దృక్పథం ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని ములుగు కలెక్టర్ దివాకర అన్నారు. సంజోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి పొర చికిత్స శిబిరాన్ని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాతో కలిసి కలెక్టర్ శనివారం సందర్శించారు. మారుమూల ప్రాంతాల్లో కంటి శస్త్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఇప్పటి వరకు 590 మంది కంటి పరీక్షలు చేయిం చుకున్నారని, వీరిలో 110 మందికి శస్త్ర చికిత్స చేయాల్సి ఉందని శిబిరం నిర్వాహకులు సం జోష్ హరి, రాంచుపల్లి ఉపేంద్ర తెలిపారు.

ఐటీడీఏ భవన స్థల పరిశీలన

మండల కేంద్రంలో ఐటీడీఏ కొత్త భవన నిర్మాణం కోసం స్థలాన్ని కలెక్టర్ దివాకర పరిశీలించారు. ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాతో కలిసి సందర్శించారు. ప్రస్తుతం ఉన్న ఐటీడీఏ భవనం శిథిలావస్థలో ఉన్న కారణంగా నూతన భవనం కోసం కొమురంభీమ్ స్పోర్ట్స్ స్టేడియం వద్ద అనువైన స్థలాన్ని గుర్తించినట్టు కలెక్టర్ తెలిపారు. ఆయన వెంట ములుగు ఆర్డీవో వెంకటేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, తహసీల్దార్ జగదీశ్వర్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు

జనగామ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జనగామ ప్రభుత్వ ఆస్పత్రి, జనగామ అర్బన్ హెల్త్ సెంటర్‌ను టాస్క్‌ఫోర్స్ ప్రధాన అధికారి ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం ట్రాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టారు. ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఫ్రిడ్జ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ట్రాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు డాక్టర్ సయ్యద్ అహ్మద్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వినీల్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజలింగం పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రిలోని డయాలసిస్ సెంటర్‌ను పరిశీలిస్తున్న ట్రాస్క్‌ఫోర్స్ బృందం

చెరువులో పడి యువకుడి మృతి



ప్రశాంత్(ఫైల్)

లింగాలఘణపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): లింగాలఘణపురం మండలం పటేల్ గూడెం చెరువులో అనంతోజు ప్రశాంత్(23) అనే యువకుడు ప్రమాదవశాత్తు పడిపోయి మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం నెమిలి గ్రామానికి చెందిన ప్రశాంత్ ఇటీవలే పటేల్‌గూడెంలోని తన సోదరి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో ఈనెల 22న గ్రామం పక్కనే ఉన్న చెరువ వైపు వెళ్లిన ప్రశాంత్ ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. ఈవిషయాన్ని గమనించని బంధువులు ప్రశాంత్ ఆచూకీ కోసం వెతుకుతుండగా శనివారం చెరువులో శవమై కనిపించాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లింగాలఘణపురం ఎస్సై బండి శ్రవణ్‌కుమార్ కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నారు. మృతునికి తండ్రి వెంకటాచారి ఉన్నారు.

సర్పంచ్ రిజర్వేషన్‌పై హైకోర్టులో పిటిషన్

కన్నాయిగూడెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని చింతగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్ల రిజర్వేషన్‌ను సవాల్ చేస్తూ ఆదివాసి సేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి మడి సాయిబాబు, గ్రామ ఆదివాసి యువకుడు మడప వెంకటేష్‌లు రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజన తండాలు, గూడేలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అందులో భాగంగా మండలంలోని బుట్టాయిగూడెం గ్రామ పంచాయతీ నుంచి చింతగూడెంను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఎలక్షన్ కమిషన్ చింతగూడెం సర్పంచ్ రిజర్వేషన్‌ను గతంతో ఎస్సీకి కేటాయించగా ఈ నెలలో ఇచ్చిన సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్‌లో బీసీ మహిళకు కేటాయించారు.

దీంతో చింతగూడెం ఐదో షెడ్యూల్‌లో ఉన్న ట్రైబల్ విలేజ్ అని ఇక్కడ నాన్ ట్రైబల్ వాళ్లకు రిజర్వేషన్ ఎలా ప్రకటించారని, ఇక్కడ 50 శాతం వార్డు మెంబర్లు, సర్పంచ్‌ను గిరిజనులకే కేటాయించాలని కోరుతూ సాయిబాబు, వెంకటేష్‌లు ఈ నెల 17న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో కోర్టునుంచి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రధానకార్యదర్శి, కమిషనర్ కార్యాలయాలకు, రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషన్ కార్యాలయం హైదరాబాదులో పాటుగా కలెక్టర్ కార్యాలయం, డీపీవో కార్యాలయం ములుగు, ఐటీడీఏ కార్యాలయం ఏటూరునాగారం చింతగూడెం గ్రామ పంచాయతీతో పాటుగా ఎంపీడీవో, కార్యాలయాలకు నోటీసులు పంపించారు. ఇదే విషయమై ఎంపీడీవో అనితను ఫోన్‌లో సంప్రదించగా కోర్టునుంచి నోటీసులు వచ్చాయని ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వ న్యాయవాదితో కౌంటర్ దాఖలు చేస్తున్నామని తెలిపారు.

కోతుల సమస్యను పరిష్కరించాలి : సీపీఎం

ములుగు టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కోతుల సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, మండల నాయకుడు రత్నం ప్రవీణ్ తదితరులు ములుగు తహసీల్దార్ విజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కోతులు జనావాసాలు, వ్యవసాయ క్షేత్రాల్లో సంచరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. అధికారులు చర్యలు చేపట్టి కోతులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కలువల రవీందర్, సీపీఎం మండల నాయకులు కొడపాక చంటి, వీరస్వామి, బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): కోతుల సమస్య నుంచి ప్రజలను, పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎమ్డీ. దావూద్, జిల్లా సీపీఎ సభ్యుడు టి. రవి, నాయకులు కర్నే లాజర్, బండారి నర్సింహులు, యాకూబ్, కుమ్మరి నర్సింహారావు, లింగమ్మూర్తి, పాపారావు, సీహెచ్. భవాని, దేవయ్య పాల్గొన్నారు.



గోవిందరావుపేటలో తహసీల్దార్ సృజన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

● వెంకటాపూర్, (ఆంధ్రజ్యోతి): కోతుల బారి నుంచి ప్రజలు, పంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. తహసీల్దార్ గిరిబాబుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రత్నం రాజేందర్, నాయకులు ఆలువాల ఐలయ్య, రెడ్డి రామస్వామి, నీలం కొమురయ్య, సాంబయ్య, బైరం భద్రయ్య, కుమారస్వామి, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

● గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండలంలో కోతుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు, ప్రజలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సృజన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గొంది రాజేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సీపీఎం నాయకులు పొదిళ్ల చిటిబాబు, ఎర్ర ధనమ్మ, గుండు రామస్వామి, బుర్ర శ్రీనివాస్, కాప కోటేశ్వర్‌రావు, గుండు లెనిన్, నిమ్మల భిక్షం, వెంకటేశ్వర్‌రావు, శ్రీను, శ్రీరామోజు సువర్ణతోపాటు ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వెల్లివిరిసిన సాంకేతిక సృజన

- 50కి పైగా ఈవెంట్లతో సందడిగా సాగిన సాంకేతికోత్సవం
- చివరి రోజూ కొనసాగిన ఈవెంట్లు
- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- విజేతలకు నగదు బహుమతుల ప్రదానం
- నిట్‌లో ముగిసిన టెక్నోజియాన్

హనుమకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో రెండు రోజుల పాటు వైభవంగా జరిగిన టెక్నోజియాన్-2025 (సాంకేతికోత్సవం) శనివారం ముగిసింది. దేశంలోని అన్ని రాష్ట్రాల ఎన్ఐటీల నుంచి వెయ్యి మందికి పైగా విద్యార్థులు టెక్నోజియాన్‌లో పాల్గొన్నారు. వరంగల్ నిట్‌లోని 7వేల మందికిపైగా విద్యార్థులు కూడా వీరితో కలిసి వివిధ ఈవెంట్లలో పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. నిట్‌లోని వివిధ టెక్నికల్ సొసైటీలు, పలు విభాగాల ఆధ్వర్యంలో 50కిపైగా ఈవెంట్లను నిర్వహించారు. ప్రతీ ఈవెంట్ ప్రత్యేకతను చాటాయి. వీటిలో చాలా వరకు కొత్తవి. సరికొత్త ఆవిష్కరణలు. వినోదాన్ని పంచే ఫన్నీ ఈవెంట్లు కొన్ని కాగా, వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచే ఈవెంట్లు మరికొన్ని. అన్నింటిలోనూ విద్యార్థులు తమ సృజనాత్మకతను చాటారు. వీరికి టెక్నోజియాన్ ముగింపు సందర్భంగా రూ.2.60 లక్షల నగదు పురస్కారాలను, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. శనివారం రెండో రోజు కూడా వివిధ ఈవెంట్లు పోటాపోటీగా సాగాయి. నిట్ అధ్యాపకులు, సాంకేతిక నిపుణులు టెక్నోజియాన్‌లో నిర్వహించిన ఈవెంట్లు, ప్రదర్శించిన ఎగ్జిబిట్లను స్వయంగా పరిశీలించి వాటి ప్రత్యేకతలను రికార్డుచేశారు. భవిష్యత్‌లో ఈ సమాచారం ప్రయోగాల కొనసాగింపునకు దోహదపడుతుందని ఈవెంట్ టీమ్‌లీడర్లు అభిప్రాయపడ్డారు.

చిన్నారుల హల్‌చల్

టెక్నోజియాన్‌లో చిన్నారులు హల్‌చల్ చేశారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తాము స్వయంగా రూపొందించిన ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. టెక్నోజియాన్ ద్వారా సాంకేతిక కళాశాలలో చదివే విద్యార్థులనే కాకుండా చిన్నారులను కూడా ప్రోత్సహించే లక్ష్యంతో వారికీ ఇందులో అవకాశంకల్పించారు. సైన్స్‌పట్ల వారిలో జిజ్ఞాస పెంపొందించే ఉద్దేశంతో వారి ఎగ్జిబిట్ల ప్రదర్శనకు అవకాశం కల్పించారు. టెక్నోజియాన్‌కు హాజరైన ఇతర రాష్ట్రాల నిటియన్లు ఈ ఎగ్జిబిట్లను ఆసక్తిగా తిలకించారు. 40కిపైగా ఎగ్జిబిట్లను ఈ సందర్భంగా ప్రదర్శించారు. పిల్లలంతా 5 నుంచి 10 ఏళ్లలోపువారే. అర్జున్ సాయి అనే ఐదేళ్ల యూకేజీ విద్యార్థి ప్రదర్శించిన మెటల్ డిటెక్టర్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎలక్ట్రిక్ సర్క్యూట్ ద్వారా లోహాలను ఎలా కనిపెట్టవచ్చో దీని ద్వారా చూపించాడు. మరో విద్యార్థి మూగవాళ్ల కోసం యూసింగ్ ఫ్లెక్సనర్ ఫర్ సింబాలింగ్ అనే పరికరాన్ని రూపొందించాడు. మూగవాళ్లు దీనిని ద్వారా సంకేతాలు పంపి తమకు కావలసింది తెలియచేయవచ్చు. మరో విద్యార్థి వీల్‌చైర్‌ను రిమోట్ ద్వారా నడిపే పరికరాన్ని తయారు చేశాడు.



● కిట్ అసెంబ్లీ

టెక్నోజియాన్‌లో భాగంగా నిట్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కిట్ అసెంబ్లీ విశేషంగా ఆకట్టుకున్నది. ఈ ఈవెంట్‌లో విద్యార్థులు ఉత్సాహంగాపాల్గొన్నారు. పోటీలో పాల్గొన్న వారికి కార్లు, మోటారు సైకిళ్లు, వివిధ వస్తువులకు సంబంధించిన విడిభాగాలను ఇస్తారు. ఒక బాక్స్‌లో ఒకటి నుంచి ఆరు వస్తువులు విడి భాగాలు ఉంటాయి. పోటీలో పాల్గొనేవారు వీటిలో ఏదైనా ఒక వస్తువు విడిభాగాలను 40 నుంచి 60 నిమిషాల్లో కలిపి దాని వాస్తవ రూపాన్ని తీసుకురావాలి. ఇలా నిర్ణీత సమయంలో ఒక కిట్‌లోని విడి భాగాలను కలపగలిగిన వారినే విజేతలుగా పరిగణిస్తారు.



● ఆప్టి మిస్ట్రీ

ఇది కూడా ప్రత్యేక ఈవెంటే. ఒక మిస్టరీని ఛేదించడానికి మనం సృజనాత్మకతను వాడుతాం. ఈ ఈవెంట్‌లో సృజనాత్మకతకు విద్యుత్‌ను కూడా జోడిస్తే.. ఇదో కొత్త భావన. నిట్‌లోని ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులు దీనిని రూపొందించారు. కొన్ని లాజికల్ ఎలక్ట్రికల్ సర్క్యూట్‌లో కొన్ని నెంబర్లు ఉంటాయి. ఈ నెంబర్ల సహాయంతో విద్యార్థులు తమ సృజనాత్మతను జోడించి కొన్ని కోడ్స్ పంపడం ద్వారా మిస్టరీని ఛేదిస్తారు. మిస్టరీని ఛేదించడంలో మనుషులతో పాటు విద్యుత్ సహాయం తీసుకోవచ్చునని దీనిని బట్టి తెలుసుకోవచ్చు.



● సుమో వార్

ఇది కూడా ఒక ఫన్నీ ఈవెంట్. సుమోల మల్లయుద్ధం లాంటిది. వాస్తవంగా అయితే బరిలో మల్లయుద్ధం సుమోలు చేస్తారు. కానీ, ఈ ఈవెంట్‌లో సుమోలకు బదులు చెక్కతో ప్రత్యేకంగా రూపొందించి చతురస్రాకారపు బాక్స్, దానిపై అమర్చిన ఇనుప ఈటె, బాక్స్‌పై బెలూనే సుమో వీరుడు. రింగ్‌లో మొత్తం నాలుగు ఉంటాయి. రింగ్‌ను అనుకొని డేంజర్ జోన్ ఉంటుంది. రిమోట్ సాయంతో ఈ బాక్స్‌లను ఒకదానికి ఒకటి ఢీకొట్టడం ద్వారా ప్రత్యర్థి బాక్స్‌ను రింగ్ బయటకు డేంజర్ జోన్‌లోకి పంపినవారే విజేత. బయటకు పంపలేకపోయినా బాక్స్‌పై ఉన్న ఈటెతో ఎదుటి బాక్స్‌పై ఉన్న బెలూన్ అయిన పగులగొట్టగలిగినా గెలిచినట్టే.



● బ్లేజ్

ఇది ఒక ఫన్నీ ఈవెంట్. లేజర్ బుల్లెట్ల ద్వారా ఎదుటి వ్యక్తిని శక్తిహీనుడిని చేయడం ఈవెంట్ ప్రత్యేకత. ఇందులో ఇద్దరు ప్రత్యర్థులు ఉంటారు. వారి చేతిలో రెండు లేజర్ గన్లు ఉంటాయి. ప్రత్యేకంగా రూపొందించిన బ్లేజర్‌ను ధరించి పోటీలో పాల్గొనాలి. ఈ బ్లేజర్‌పై రిసీవర్ ఉంటుంది. ఇద్దరు వ్యక్తులు తమ లేజర్ గన్‌ల ద్వారా దానిపై సరిగ్గా గురిపెట్టి పరస్పరం షూట్ చేసుకుంటే లేజర్ బుల్లెట్ ఎవరికి తగులుతుందో ఆ ప్రత్యర్థి శక్తి విహీనమవుతాడు. అలా ఎవరైతే ముందుగా తన ప్రత్యర్థిని శక్తివిహీనుడిని చేస్తారో వారు విజేత. వరంగల్ నిట్ రోబోటిక్ ట్యాబ్ దీనిని రూపొందించింది.



● నో బగ్స్ గివెన్

ఇది కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు పరీక్ష పెట్టే ఈవెంట్. ఈవెంట్‌లో ఐదు నుంచి ఆరు రౌండ్లు ఉంటాయి. ఒక ప్రాజెక్టులోని బగ్స్(ఎర్రర్స్)ను కోడింగ్ ద్వారా ఎంత వేగంగా చేయగలిగితే అంత ర్యాంక్ వస్తుంది. కోడింగ్ మొదట పూర్తి చేసిన వారు ఒక రౌండ్ నుంచి ఇంకో రౌండ్‌కు వెళుతుంటారు. మొత్తం ఆరు రౌండ్లు ఉంటాయి. ఇందులో మొదటి మూడు రౌండ్లు ఎవరు ముందు చేస్తే వారే విజేతలు. ఈ పోటీలో సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు.



● ఫొటో డిజైన్

టెక్నోజియాన్‌లో భాగంగా ఫొటో డిజైనర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సాంకేతిక ఉత్సవంలో పాల్గొనే విద్యార్థులు తీపి గుర్తుగా ఇక్కడ నిలబడి ఫొటోలు దిగేందుకు పోటీపడ్డారు. అందమైన ఫ్రేమ్‌ను రూపొందించారు. ఆ ఫ్రేమ్ మధ్యలో నిలబడడం ద్వారా దిగే ఫొటోలు కళాత్మకంగా కనిపిస్తున్నాయి.



● మోషన్ క్యాప్చర్ వర్క్‌షాప్

ఈ వర్క్‌షాప్ టెక్నోజియాన్‌లో ప్రత్యేకంగా నిలిచింది. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. స్క్రీన్‌పై పదికి పైగా కార్టూన్ పాత్రలు ఉంటాయి. అందులో ఏదైనా ఒక దానిని ఎంచుకోవాలి. ఎదురుగా కెమెరా ఉంటుంది. దానిముందు నిల్చొని మనం ఎలా నటిస్తే స్క్రీన్‌పై మనం ఎంచుకున్న కార్టూన్ అలా కదులుతుంది. దీనిని రికార్డు చేస్తే కార్టూన్ ఫిల్మ్ అవుతుంది.



● మర్డర్ మిస్టరీ

టెక్నోజియాన్‌లో ఎక్కువగా ఆకట్టుకున్న ఈవెంట్ మర్డర్ మిస్టరీ. ఫన్నీగా, ఎగ్జైటింగ్‌గా ఉన్న ఈ ఈవెంట్ విద్యార్థుల తెలివి తేటలకు పరీక్ష పెట్టింది. ఓ హత్య కేసును ఛేదించే క్రమంలో కృత్రిమ మేధ చాట్‌బాట్స్‌ను ఉపయోగించి అనుమానితులుగా పేర్కొన్న వారి ప్రవర్తనను నిశితంగా బేరీజు వేసుకుంటూ హత్యోదంతానికి రూపకల్పనచేసి తద్వారా ఈ అనుమానితుల్లోని అసలైన హంతకుడిని గుర్తించడం ఈ ఈవెంట్ ప్రత్యేకత. ఇందుకు 40 నిమిషాల వ్యవధిఉంటుంది. ఆలోగా ఏటీమ్ గుర్తిస్తే అదే విజేత. ఇంకో టీమ్‌లో ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులు ఉంటారు.

క్రమశిక్షణ, నిబద్ధతతోనే విజయం

- జీవితంలో స్వీయ కృషి ఎంతో ముఖ్యం
- గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలి
- రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ డైరెక్టర్ బాలలత
- వరంగల్ నిట్‌లో ప్రేరణాత్మక ప్రసంగం

హనుమకొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, నిబద్ధత, దూరదృష్టి ద్వారా ఎలాంటి సవాళ్లయినా అధిగమించి విజయాన్ని సాధించవచ్చునని రక్షణ మంత్రిత్వ శాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్, సివిల్ పరీక్షల శిక్షకురాలు, మోటివేటర్ మల్లవరపు బాలలత అన్నారు. శనివారం వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్-2025లో భాగంగా విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలలత మాట్లాడుతూ.. జీవితంలోని ప్రతీ దశలో నిరంతర కృషి, స్వీయ విశ్వాసం ముఖ్యమన్నారు. విద్యార్థులు ఇష్టమైన వృత్తిని ఎంచుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఎలాన్ మస్క్ క్రమబద్ధమైన పని విధానం గురించి బాలలత ఆసక్తిగా వివరించారు. ఆయన చిన్న విరామాలతో క్రమ శిక్షణతో కూడిన పనిసమయాలను పాటిస్తారని చెప్పారు. అలాగే రతన్‌టాటా స్వభావం, వినయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. విద్యార్థులు గొప్ప గొప్ప విజయాలు సాధించిన వ్యక్తుల జీవితాల నుంచి ప్రేరణ పొందాలని, వారి ఆదర్శంగా తీసుకొని జీవితంలో ఎదగాలని అన్నారు. మొబైల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. విజయవంతమైన వ్యక్తులు తమ సమయాన్ని, ఆలోచనను సమాజాభివృద్ధికి, నూతన ఆవిష్కరణలకు వినియోగిస్తారని అన్నారు. నియమబద్ధమైన జీవనం, విశ్లేషణాత్మకమైన ఆలోచనలు, నిరంతర అధ్యయనం, కొత్త విషయాలను తెలుసుకోవాలనే జిజ్ఞాస వంటి మంచి అలవాట్లు విజయానికి సోపానాలని అన్నారు. అనంతరంవిద్యార్థులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. వారు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలుఇచ్చారు. తన జీవిత ప్రయాణాన్ని సంక్షిప్తంగా వివరించారు.



మాట్లాడుతున్న బాలలత



మూగ వారి కోసం తయారు చేసిన సెన్సార్ పరికరం



చిన్నారి రూపొందించిన మెటల్ డిటెక్టర్



లైట్ పెయింటింగ్‌పై వర్క్‌షాపులో ప్రసంగిస్తున్న విషయ నిపుణుడు



చిన్నారుల ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న సందర్శకులు

సీజేఐపై దాడి న్యాయ వ్యవస్థ, రాజ్యాంగంపై దాడి

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

బాలసముద్రం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టులో చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా(సీజేఐ)పై ఒక లాయర్ బూటుతో దాడి చేసిన సంఘటన న్యాయ వ్యవస్థపై, రాజ్యాంగంపై, దళితుల ఆత్మగౌరవంపై జరిగిన దాడిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అభివర్ణించారు. దళితుడైన గవాయ్‌పై దాడి జరిగితే దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం పట్ల ఈ వ్యవస్థలన్నీ ఎందుకు మౌనంగా ఉంటున్నాయనే ప్రశ్నకు ఇంత వరకు జవాబు దొరకడం లేదన్నారు. శనివారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంద కృష్ణ మాదిగ మాట్లాడారు. దేశంలో న్యాయ వ్యవస్థకు అధిపతి అయిన చీఫ్ జస్టిస్‌పై దాడి జరిగితే ఎలాంటి చర్యలు చేపట్టక పోవడానికి కారణాలేంటో అర్థం కావడం లేదన్నారు. దాడి జరిగాక దేశ ప్రధాని నరేంద్రమోదీ గవాయ్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ దాడిని దేశం యావత్తు ఖండిస్తోందని, ఈ సంఘటన ప్రతీ భారతీయుడిని ఆగ్రహానికి గురి చేసిందని, ఇది న్యాయ వ్యవస్థపై దుర్మార్గమైన చర్య అని అన్నారని మంద కృష్ణమాదిగ తెలిపారు. దేశ ప్రతిపక్ష నేతలైన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ సంఘటనను రాజ్యాంగంపై, న్యాయవ్యవస్థపై, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి అని ఖండించారని అన్నారు. అంతేగాక సిద్ధాంతాలు ఏమైనప్పటికీ దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు, వామపక్షాలతో సహా సంఘటనను ఖండించాయని ఇంకా దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు ఎందుకు చేయడం లేదని డిమాండ్ చేయకుండా ఎందుకు మౌనం వహిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

దేశంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న మల్లికార్జున ఖర్గే దళితుడైనప్పటికీ ఎందుకు మౌనం వహిస్తున్నారో జవాబు చెప్పాలని అన్నారు. సంఘటనపై మానవ హక్కుల కమిషన్ ఎందుకు స్పందించడం లేదన్నారు. సంఘటనను మేధావులతో సహా అన్ని వ్యవస్థలు ఖండించినా ఎందుకు నిరసన తెలపడం లేదని అన్నారు. దళిత పార్టీలకు న్యాయకత్వం వహిస్తున్న పార్టీలు కూడా ఎందుకు మౌనంగా ఉంటున్నాయని అన్నారు. స్వతంత్ర న్యాయ వ్యవస్థపై జరిగిన దాడి పట్ల దక్షిణాది రాష్ట్రాల్లో బలంగా ఉన్న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో దళితుల ఆత్మగౌరవం పేరుతో లక్షలాది మందితో నవంబరు 1న నిరసన ప్రదర్శనకు పూనుకుంటున్నట్లు మంద కృష్ణ మాదిగ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా న్యాయ వ్యవస్థపై గౌరవం ఉన్న రాజకీయ పార్టీలన్నీ నిరసన ప్రదర్శనలో పాల్గొనాల్సిందిగా మంద కృష్ణ మాదిగ పిలుపు నిచ్చారు. మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద సుకుమార్ మాదిగ, జిల్లా ఇన్‌చార్జి గంగారపు శ్రీనివాస్ మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి అక్కెనకుంట వెంకటస్వామి మాదిగ, ఎంఎస్‌పీ జిల్లా నాయకులు చాతాళ్ల శివ మాదిగ, మాదిగ యువసేన నాయకులు పాల్గొన్నారు.

హాస్టల్స్ అడ్మిషన్లన్నీ ఆన్‌లైన్‌లోనే..

- దుబారా అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు
- పీజీ కొత్త విద్యార్థులకు హాస్టల్స్ అడ్మిషన్లు
- కొత్త విద్యార్థులతో కేయూలో సందడి





హాస్టల్ అడ్మిషన్ పత్రాలను ఇస్తున్న డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, కొత్త విద్యార్థులతో కేయూ హాస్టల్ ఆఫీస్ వద్ద సందడి

కేయూ క్యాంపస్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీలో కొత్త విద్యార్థులతో సందడి నెలకొంది. ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర కోర్సుల అడ్మిషన్లు జరుగుతున్నాయి. అక్టోబరు 24 నుంచి ఫిబ్రవరి 19 వరకు పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ అల్మానాక్ విడుదల చేయడంతో విద్యార్థులతో వర్సిటీలో సందడి నెలకొంది. కొత్తగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు హాస్టళ్లలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. గతంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది నుంచి హాస్టల్ అడ్మిషన్లన్నీ ఆన్‌లైన్‌లోనే చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్ నేతృత్వంలో రూపొందించారు. విద్యార్థుల సమగ్ర వివరాలన్నీ కేయూ హాస్టల్స్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. హాస్టల్స్ డిపాజిట్‌ను చెల్లించగానే అడ్మిషన్ ఫామ్ జనరేట్ అవుతుంది. అడ్మిషన్ ఫామ్ డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత విభాగాధిపతితో సంతకం చేయించి వర్సిటీ హాస్టల్స్ ఆఫీస్‌లో అందచేయగానే రూమ్‌తోపాటు మెస్‌కార్డు ఆటోమెటిక్‌గా జనరేట్ అవుతుంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నామని కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ వెల్లడించారు.

కేయూ హాస్టల్ వెబ్‌సైట్ ఇదే..

కాకతీయ యూనివర్సిటీలో ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీతో పాటు ఇతర ఏదైనా రెగ్యులర్‌లతో పాటు కొన్ని ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు వర్సిటీలో వారి కోర్సు కాలపరిమితి మేరకు హాస్టల్‌తోపాటు మెస్ సౌకర్యాలు కల్పిస్తారు. హాస్టల్ వసతి కోసం కేయూ కాలేజేస్.కో.ఇన్ అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అకడమిక్ ఇయర్, కోర్సు టైప్, కోర్సు, కోర్సు ఇయర్, సెమిస్టర్, కాలేజీ, హాల్‌టికెట్ నెంబరు, స్టూడెంట్, తండ్రి, తల్లి పేరుతో పాటు పాటు పుట్టిన తేదీ, సామాజిక వర్గం, అడ్రస్, డిపాజిట్ వివరాలతో పాటు ఫొటో నమోదు చేయాలి. తర్వాత హాస్టల్ ఫామ్ జనరేట్ అయిన తర్వాత డౌన్‌లోడ్ చేసుకుని మెస్, హాస్టల్స్ సౌకర్యాలు పొందాలి. వెబ్‌సైట్ అడ్రస్ https://kucolleges.co.in/hostels/newad-mission వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్ వెల్లడించారు.

హాస్టల్స్ ఫీజుల వివరాలు ఇవే..

కేయూలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు సామాజిక వర్గాల వారీగా హాస్టల్స్ డిపాజిట్లను నిర్ణయించారు. ఓసీ కేటగిరి అభ్యర్థులు రూ.12,200, బీసీ కేటగిరి అభ్యర్థులు రూ.10,200, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు రూ.8,200 చెల్లించాలి. అన్ని కేటగిరీలకు చెందిన దివ్యాంగులు ఎలాంటి ఫీజులు చెల్లించనవసరం లేదని డైరెక్టర్ తెలిపారు.

కావాల్సిన ధృవపత్రాలివే..

హాస్టల్స్‌లో అడ్మిషన్ పొందేందుకు అభ్యర్థులకు కాలేజీ అలాట్‌మెంట్ ఫామ్, హాస్టల్ అడ్మిషన్ రశీదు, ప్రిన్సిపాల్ ఆఫీస్ అడ్మిషన్ రశీదు, ఆదాయ ధృవీకరణ, ఆధార్‌కార్డు, కుల ధృవపత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు జత చేయాలి.

మహిళలకు పద్మాక్షి.. పురుషులకు న్యూపీజీ హాస్టల్..

నూతనంగా కేయూలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తారు. మహిళా అభ్యర్థులకు క్యాంపస్‌లోని పద్మాక్షి లేడీస్ హాస్టల్, అలాగే పురుషులకు న్యూపీజీ హాస్టల్‌లో గదులు కేటాయిస్తారు. ఇతర వివరాలకు క్యాంపస్‌లోని హాస్టల్ ఆఫీస్‌లో సంప్రదించాలని కోరారు. దరఖాస్తులు చేసుకున్న వారందరికీ హాస్టల్స్, మెస్ సౌకర్యాలు అప్పటికప్పుడు అందిస్తామన్నారు.

కొత్త విద్యార్థులతో క్యాంపస్ కళకళ


అక్టోబరు 24 నుంచి పీజీ కోర్సుల సెమిస్టర్ తరగతులు షురువు కావడంతో విద్యార్థులు క్యాంపస్‌కు తరలివచ్చారు. హాస్టల్ వసతి కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. అన్ని విభాగాల విద్యార్థులతో క్యాంపస్ కొత్త కళ సంతరించుకుంది. పీజీ అడ్మిషన్ల రెండో దఫా, మూడో దఫా అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగుతోంది. మొదటి దఫాలోనే క్యాంపస్ కళాశాలలో దాదాపుగా సీట్లన్నీ నిండినట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

ఎంజీఎం సూపరింటెండెంట్‌పై వేటు?

- వరుస సంఘటనలపై ఆరోగ్య శాఖ మంత్రి సీరియస్

వరంగల్ మెడికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎంజీఎంలో జరుగుతున్న వరుస సంఘటనలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సీరియస్ అయినట్లు తెలిసింది. ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై వేటు వేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శిని శనివారం ఆదేశించిన ట్లు తెలిసింది. అదేవిధంగా ప్రతీవారం ఎంజీఎంపై సమీక్ష నిర్వహించి సమగ్ర నివేదిక సమర్పించాలని డీఎంఈని మంత్రి ఆదేశించినట్లు సమాచారం. ఎంజీఎం ఘటనలపై 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలను ప్రచురించింది. ఎంజీఎంలో మంచం ఎక్కిన పాలన, ఎంజీఎంలో గాడితప్పిన పాలన, శిథిలావస్థకు చేరిన నర్సింగ్ స్కూల్ భవనం లాంటి కథనాలు ప్రచురితం అయ్యాయి. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై వేటు వేయాలని ఆదేశించినట్లుగా తెలిసింది. అదేవిధంగా పలువురు ఉద్యోగుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి. కనీసం నూతన సూపరింటెండెంట్ అయినా ఎంజీఎం పాలనను గాడిలో పెట్టాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కేఎంసీలో ఉత్కర్ష-2025 ప్రారంభం



వేడుకల్లో పాల్గొన్న కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య, తదితరులు

వరంగల్ మెడికల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకతీయ మెడికల్ కాలేజీ వార్షిక కళాశాల ఉత్సవం ఉత్కర్ష-2025 శనివారం ప్రారంభమైంది. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య సుంకరనేని అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డాక్టర్ శ్రీధర్ కస్తూరి (1980 బ్యాచ్ అలుమిని), సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య మాట్లాడుతూ.. ఉత్కర్ష ప్రతీ సంవత్సరం విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనకు, సామాజిక బాధ్యతాభావం పెంపొందించేందుకు వేదికగా నిలుస్తుందని తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు వివిధ సాంస్కృతిక, క్రీడా, సామాజిక కార్యక్రమాలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మధుబాబు, డాక్టర్ పుల్లయ్య, డాక్టర్ రమేశ్, డాక్టర్ గౌతమ్, వైద్య విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి వేడుకలు


జఫర్‌గడ్‌లోని శివాలయంలో పూజలు


స్టేషన్ ఘన్‌పూర్ శివాలయంలో భక్తుల పూజలు


నల్లపోచమ్మ దేవాలయంలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు


పాలకుర్తి ఆంజనేయస్వామి ఆలయంలో..

జనగామ కల్చరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని అభిషేకాలు, అర్చనలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు శనివారం జనగామ జిల్లాలో నాగులచవితి పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా లోని స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, పాలకుర్తి నియోజకవర్గాలతో పాటు జిల్లా కేంద్రంలోని నల్ల పోచమ్మ దేవాలయం, గీతాశ్రమం, బాణాపురం, గుండ్లగడ్డ, బాలాజీనగర్ ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా దేవస్థానాల్లోని పుట్టల వద్ద భక్తులు పాలు పోసి ప్రత్యేక పూజలు చేపట్టారు. సర్పదోషాలు తొలగి కుటుంబం ఐశ్వర్యం, పిల్లల ఆయుష్షు పెరుగుతుందని విశ్వసిస్తూ నాగులమ్మను వేడుకున్నారు. అనంతరం ఉపవాసాలతో నాగులమ్మకు నైవేద్యం సమర్పించారు.

●జఫర్‌గడ్ : నాగుల చవితి వేడుకలను శనివారం మండల కేంద్రంలోని శివాలయంలో భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతీ ఏటా కార్తీక మాసంలో శుక్లపక్ష చవితి రోజున జరుపుకునే నాగులచవితి సందర్భంగా శివాలయంలోని పుట్టలో మహిళలు, భక్తులు పాలు, పోసి నైవేద్యాన్ని సమర్పించారు. భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిపి. సర్పదోషాలు తొలగిపోవాలని, పాడిపంటలు, పిల్లా పాపలతో సుఖ సంతోషాలతో ఉండాలని నాగదేవతను ప్రార్థించారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్ పురాతన రామలింగేశ్వరాలయం, శివునిపల్లి పట్టణ నగరేశ్వరాలయంలో, వేంకటేశ్వరాలయంలో శనివారం నాగుల చవితి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు నాగ దేవతను పూజించడానికి తరలి రావడంతో రద్దీ నెలకొంది. దేవాలయాల్లో నాగు పాము పుట్టలకు పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో విలసిల్లాలని నాగదేవతను వేడుకున్నారు. పూజారులు రామలింగయ్య, ప్రవీణ్, కె.సతీష్, సునీత, శరత్, భార్గవి, వేణు, మౌనిక, రాజేశ్, తేజుల్యా, దేవకి, సురేష్, మధు పాల్గొన్నారు.

● పాలకుర్తి : నాగుల చవితిని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని పాటిమీది ఆంజనేయ స్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. నాగుల చవితిన పుట్టలో పాలు పోస్తే అష్టైశ్వరాలు చేకూరుతాయని సర్పపూజ చేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయం, కుజ దోషాలున్నవారు, సాంసారిక బాధలన్నవారికి శుభం కలుగుతుందనే నమ్మకం. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. నాగుపాము పుట్టలో పాలు పోసి నైవేద్యం పెట్టారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవగిరి అనిల్, ఆలయ ప్రధాన పూజారి గంగు రఘుశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

పశు పోషణపై రైతులు జాగ్రత్తగా ఉండాలి


పశువుకు టీకా వేస్తున్న వైద్యాధికారి జితేందర్

నర్మెట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులు పశు పోషణ పట్ల జాగ్రత్త ఉండాలని మండల పశు వైద్యాధికారి జితేందర్ అన్నారు. శనివారం మండలంలోని బొమ్మకూరు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేశారు. జేవీఓ సుభద్ర, వీఏ శివనాగరాజు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

● పాలకుర్తి : పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని చెన్నూరు పశువైద్యాధికారి డాక్టర్ రమ్య అన్నారు. శనివారం మండలంలోని తీగారంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమ్య మాట్లాడుతూ రైతులను ఆర్థికంగా నష్టం చేసే వ్యాధులతో ముఖ్యమైన వ్యాధి గాలికుంటు వ్యాధి అన్నారు. తీగారంలో 180 పశువులు, గేదెలకు టీకాలు చేశామని తెలిపారు. జూనియర్ పశువైద్యాధికారి శివప్రసాద్, రైతులు ఐలేష్, చిదురాల ఎల్లయ్య ఉన్నారు.

బీసీ జేఏసీ నాయకుల సమావేశం

జనగామ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కేంద్రంలోని శనివారం బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు దూడల సిద్దయ్య గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన స్టీరింగ్ కమిటీపై చర్చించారు. ఈ సందర్భంగా అడిక్ కమిటీ చైర్మన్ సెవెల్లి సంపత్, వైస్ చైర్మన్ ధర్మపురి శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు కల్పించేంతవరకు తమ పోరాట కొనసాగుతుందన్నారు. డాక్టర్ కల్నాల్ మాచర్ల బిక్షపతి ముదిరాజ్ పండుగ హరీశ్ ముదిరాజ్ మంగళంపల్లి రాజు, జాయ మల్లేశ్, అభినాశ్ పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి జెరిపోతుల మల్లయ్య

జనగామ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి జెరిపోతుల మల్లయ్య, జిల్లా అధ్యక్షుడు మడిపడిగ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. బీఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం జనగామ నియోజకవర్గ అధ్యక్షురాలు గంధమాల నవనీత అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథులుగా మల్లయ్య, చంద్రశేఖ ర్ హాజరై మాట్లాడారు. బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యాయన్నారు. బీసీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ నవంబరు 1 హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద చేపట్టే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తాండ్ర లావణ్య, చిలుముల అర్జున్, సిద్దులు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి
ఎమ్మెల్యే కడియం పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, అ క్టోబరు 25(ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ మునిసిపల్ పరిధిలోని శివునిపల్లి పట్టణంలో శనివారం ఎరువుల వ్యాపారి నూక రమేశ్ మాతృమూర్తి అనసూర్య(85) అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులు పద్మ, ప్రభాకర్, రేవతి, రామకృష్ణ, శ్రావణ్, సందీప్‌లను ఎమ్మెల్యే కడియం శ్రీహరి కలుసుకుని పరామర్శించారు. మృతురాలి నేత్రాలను దానం చేసి ఇద్దరికి చూపు రావడానికి సహకరించిన కుటుంబ సభులను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బూర్ల శంకర్, నీల గట్టయ్య, జిల్లా ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షుడు తెల్లాకుల రామకృష్ణ, పార్సీ కమల్, కూరెల్లి కృష్ణమూర్తి, జె.మహేందర్ పాల్గొన్నారు.

నేత్రాల సేకరణ

మరణానంతరం మృతురాలు నూక అనసూర్య నేత్రాలు దానం చేయడానికి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. కుటుంబ సభ్యులు నూక రమేశ్, పద్మ, రేవతి, తెల్లాకుల రామకృష్ణ, శ్రావణ్, సందీప్‌ల సమ్మతితో లయన్స్ క్లబ్ ఆఫ్ శివునిపల్లి ఆధ్వర్యంలో హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వారు నేత్రాలు సేకరించారు. నేత్రదా నానికి ముందుకు వచ్చి మరో ఇద్దరికి చూపు ప్రసాదించేలా సహకరించిన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. ల యన్స్ క్లబ్ అధ్యక్షుడు గౌరిశెట్టి అనిల్, జోన్ చైర్మన్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి, పార్సీ కమల్, హరినాథ్, పార్సీ రంగారావు, టెక్నిషియన్ నరేందర్ పాల్గొన్నారు.

కలెక్టర్ చొరవతో బస్ షెల్టర్ నిర్మాణానికి నిధుల విడుదల


ఆర్టీసీ ఆర్ఎంను సన్మానిస్తున్న అడ్వకేట్ అనిల్‌గౌడ్, నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్‌భాషా ప్రత్యేక చొరవతో మండలంలోని ఛాగల్లులో బస్ షెల్టర్ నిర్మాణానికి గాను ఎన్‌హెచ్ అధికారులు ఎట్టకేలకు ఆర్టీసీ అకౌంట్‌లో నిధులు జమ చేశారు. దీంతో ఏడేళ్ల నిరీక్షణకు తీరిం దని ఛాగల్లు గ్రామ అడ్వకేట్ గద్దె అనిల్‌కుమార్ గౌడ్ తెలిపారు. శనివారం గ్రామ నాయకులతో కలిసి బస్ షెల్టర్ నిర్మాణానికి నిధులు రావడానికి కృషి చేసిన ఆర్టీసీ ఆర్ఎం విజయభానును ఆయన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా అనికుమార్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ విస్తరణ పనుల్లో భాగంగా గ్రామంలో ఆర్టీసీ బస్ షెల్టర్‌ను ఎన్‌హెచ్ అధికారులు తొలగించారు. ఆర్టీసీ అధికారుల అభ్యర్థన మేరకు బస్‌షెల్టర్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఆర్టీసీ అధికారులతో కలిసి 2018లో అప్పటి జిల్లా కలెక్టర్‌కు అప్పీలు చేశామన్నారు. జనవరి 2025న ప్రస్తుత జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌భాషా ఆర్టీసీకి అనుకూలంగా బస్‌షెల్టర్ నిర్మాణానికి గాను రూ 8,06,100 మంజూరు చేయాలని తీర్పు వెలువరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్‌హెచ్ అధికారులు శనివారం బస్‌షెల్టర్ నిర్మాణానికి గాను రూ 8,06,100 నిధులను ఆర్టీసీ అకౌంట్‌లో జమచేసినట్లు తెలిపారు. గ్రామంలో బస్‌షెల్టర్ నిర్మాణానికి గాను సహకరించిన ఆర్టీసీ ఆర్ఎంను గ్రామస్తులతో కలిసి సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చేపూరి ప్రభాకర్, భాస్కుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రభుత్వ ప్రోత్సాహం


మాట్లాడుతున్న రెడ్‌కో జిల్లా మేనేజర్ ప్రతాప్‌రెడ్డి

రఘునాథపల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా సహజ వనరుల వినియోగమే లక్ష్యంతో సౌర విద్యుత్తును అందరికి అందుబాటులోకి తీసువచ్చేందుకు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని టీజీ రెడ్‌కో జిల్లా మేనేజర్ గంగుల ప్రతాప్ రెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి సూర్యాఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం పై మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఫ్త్ బిజిలి యోజన పథకంలో గృహ విద్యుత్తు వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కిలో వాట్‌కు రూ.30 వేల నుంచి మూడు కిలోవాట్లకు రూ.78 వేల వరకు రాయితీ ఇస్తుందని తెలిపారు. సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా గృహ అవసరాలకు పోను మిగతా విద్యుత్తును నెట్ మీటర్ ద్వారా విద్యుత్తు సంస్థలకు విక్రయించి అదనపు ఆదాయం పొందే అవకాశం కలుగుతుందని అన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రకాష్, ఫీల్డ్ ఆఫీసర్ దీపక్, మహిళా సంఘాల సభ్యులు మినుముల పద్మావతి, లక్ష్మి, కోళ్ల కీర్తన పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జఫర్‌గడ్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూనూరులో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ముక్కెర యాకయ్య కుటుంబీకులను బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి పెరుమాండ్ల వెంకటేశ్వర్లు పరామర్శించారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి యాకయ్య చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. కుటుంబీకులను ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సారయ్య, నర్సయ్య, వెంకటేశ్వర్లు, కొమురెల్లి, రమేశ్, వెంకటయ్య, అజయ్, బాబు తదితరులు పాల్గొన్నారు.


యాకయ్య చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర నేత వెంకటేశ్వర్లు

బోల్తాపడిన లారీ.. తప్పిన ప్రమాదం


బోల్తాపడిన లారీ ఇదే

బచ్చన్నపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారిపై కొడవటూరు కమాన్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు గుంతలమయమై నిత్యం పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శనివారం తెల్లవారు జామున బోధన్ నుంచి కాకినాడ వైపు వెళుతున్న లారీ రోడ్డుపై గుంతల మూలంగా ఎగిరిపడి రోడ్డు కిందకు బోల్తాపడింది. తృటిలో ప్రాణాపాయం నుంచి డ్రైవర్‌తో సహా పలువురు బయటపడ్డారు. ప్రతిరోజు వాహనదారులు పదుల సంఖ్యలో ప్రమా దాల భారిన పడుతున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. ఇప్పటికే రెండు సార్లు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, సీపీఎం నేతలు పాదయాత్ర చేసి నిరసనలు తెలిపినా, ఏమాత్రం పట్టింపు లేకుండా వ్యవహరి స్తున్నారని వాహనదారులు, ప్రయాణికులు మండిపడ్డారు.

ఎమ్మెల్యే కడియంను కలిసిన నాయకులు


ఎమ్మెల్యే శ్రీహరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న బెలిదె వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఘన్‌పూర్-పాలకుర్తి రోడ్డు నుంచి మండలంలోని విశ్వనాథపురం, తానేధార్‌పల్లి, జఫర్‌గడ్ మండలంలోని తీగారం, సురారం, గ్రామాల మీదుగా తమ్మడపల్లి ఎక్స్ రోడ్డు వరకు గల రోడ్డు విస్తరణకు గాను ఎమ్మెల్యే కడియం శ్రీహరి రూ 14కోట్ల నిధులు మంజూరి చేసినందుకు గాను రైసు మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న ఆధ్వర్యంలోని విశ్వనాథపురం, తానేధార్‌పల్లి గ్రామాలకు చెందిన నాయకులు శనివారం ఎమ్మెల్యేను హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు మంతెన ఇంద్రసేనారెడ్డి, అక్కిరెడ్డి సంపత్ రెడ్డి, మాచర్ల కుమారస్వామి, దుంపల సురేష్ రెడ్డి, గాదె సుధాకర్, గాదె చంద్రయ్య, గడెం కుమార్, ఆకుల క్రిష్ణంరాజు, రాంచందర్ రెడ్డి, గుర్రం యాదగిరి, ఐలోని రాజేంద్ర ప్రసాద్, ఎమ్డీ అక్బర్ పాషా, నర్ర రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఓ వ్యక్తి దగ్గర 50 గ్రాముల గంజాయి పట్టుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎస్సై రమేష్ ఆధ్వర్యంలోని సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ములుగు జిల్లా కేంద్రానికి చెందిన భూక్య సిద్దు అనే వ్యక్తి బైక్‌ను తనిఖీ చేయగా అందులో రూ 2500 విలువ చేసే 50గ్రాముల గంజాయిని గుర్తించినట్లు తెలిపారు. నిందితుడు సిద్దును అదుపులోకి తీసుకొని, గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పాలకుర్తి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : పాలకుర్తి, జనగామ ప్రధాన రోడ్డులో మొక్కజొన్నలు ఆరబోయడంతో మోటర్ సైకిల్‌పై వెళుతున్న ఓ వాహనదారుడు తీవ్ర గాయాలు కాగా ఆస్పత్రి పాలైన ఘటన మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం పని మీద పాలకుర్తికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల ఎదుట రోడ్డుపై ఓ రైతు మొక్కజొన్నలను ఆరబోశాడు. వర్షం కురవడంతో జొన్నలను కుప్పగా పోసి దానిపై నల్లటి పరదా కప్పారు. రాత్రి కావడం వల్ల మొక్కజొన్న కుప్పపై నుంచి మోటార్ సైకిల్ వెళ్లడంతో సోమయ్య కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు జనగామమ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

హైకోర్టు ఉత్తర్వులు బేఖాతరు చేయడం తగదు

బచ్చన్నపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో కేసు నడుస్తుండగా, రెవెన్యూ అధికారులు ప్రజాప్రకటన జారీ చేయడం ఏంటని బచ్చన్నపేటకు చెందిన పలువురు అధికారుల తీరును ప్రశ్నించారు. శనివారం బియ్య లింగయ్య, బూరుగు భాస్కర్, వడ్డెపల్లి వెంకట్‌రెడ్డి, సందెల మల్లయ్య తదితరులు మాట్లాడుతూ విచారణలో ఉన్న ప్రతిపాదిత నేషనల్ హైవే-365బీ బచ్చన్నపేట బైపాస్ రోడ్డుకు సంబంధించి తేదీ లేకుండా డివిజనల్ రెవెన్యూ అధికారి ప్రజాప్రకటన జారీ చేశారన్నారు. బచ్చన్నపేట గ్రామం మధ్యలో నుండి బైపాస్ రోడ్డు వేయడం మూలంగా జరిగే అనర్థాలపై పలువురు కోర్టును ఆశ్రయించగా, ఎలాంటి పనులు చేపట్టకుండా యథాస్థితిని కొనసాగించాలని ఉత్తర్వులిచ్చిందన్నారు. దీన్ని బేఖాతరు చేస్తూ దౌర్జన్యంగా తమ భూములను స్వాధీనం చేసుకోవడానికి అధికారులు యత్నిస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని తమకు న్యాయం జరిగేలా వేసిన ప్రకటనను నిలుపుదల చేయాలని కోరారు.

ఏషియన్ యూత్ గేమ్స్‌లో ఇప్పగూడెం వాసి ప్రతిభ


లోడెంగ రాము

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బహరాన్ దేశంలోని మనామాలో జరుగుతున్న 3వ ఏషియన్ యూత్ గేమ్స్‌లో 400 మీటర్ల రన్నింగ్ పోటీలో మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన లోడెంగ రాము ఫైనల్‌కు చేరుకున్నాడు. శనివారం జరిగిన హీట్స్‌లో 49.62 సెకండ్లలో వేగంతో మూడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరుకున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రాము చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి తల్లి సహకారంతో మొక్కవోని పట్టుదలతో కోచ్ రాజేష్ వద్ద శిక్షణ తీసుకుంటూ అంతర్జాతీయ వేదిక పైన ఫైనల్‌కు చేరుకున్నాడు. అథ్లెటిక్ విభాగంలో ఏషియా యూత్ గేమ్స్‌లో ఉమ్మడి జిల్లాలోనే ఫైనల్‌కు చేరిన క్రీడాకారుడిగా రికార్డు సృష్టించినట్లు క్రీడా కోచ్‌లు తెలుపుతున్నారు. ఆదివారం జరుగనున్న ఫైనల్ పోటీలో విజయం సాధించి గ్రామానికి అంతర్జాతీయ స్థాయిలో కీర్తి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు. రాము ఫైనల్‌కు చేరడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి


పిచ్చి మొక్కలను తొలగించిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

జనగామ రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు బాధ్యతగా మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ అన్నారు. తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శనివారం మండలంలోని శామీర్‌పేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలను పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. హెచ్ఎం మధుసుదన్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి కె. అరుణ కుమారి, జీపీ కార్యదర్శి స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

లింగాలఘణపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): లింగాలఘణపురం మండల కేంద్రంతో పాటుగా నేలపోగుల, వడ్డిచర్ల, కొత్తపల్లి గ్రామాల్లో శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ వైస్‌చైర్మన్ కొల్లూరు శివకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ మల్ల శ్రీశైలం, మార్కెట్ మాజీ డైరెక్టర్ బుషిగంపల ఆంజనేయులు, ఏపీఎం నాగేశ్వర్‌రావు, సీసీ సత్యనారాయణ, నాయకులు లొక్కుంట్ల ప్రవీణ్, కడారి కృష్ణ, చిటుకుల వెంకటేశ్వర్లు, కోతి రాములు, దూసరి సోమనర్సయ్య, రెడ్డబోయిన రాజయ్య, రేగు అంజయ్య, గండి దశరథ, గుగ్గిల్ల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివకుమార్ తదితరులు

ఎమ్మెల్యే కడియంతోనే నియోజకవర్గ అభివృద్ధి

చిలుపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధి మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే కడియం శ్రీహరికే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు స్పష్టం చేశారు. అభివృద్ధి నిధుల మంజూరులో భాగంగా ఎన్‌హెచ్ పల్లగుట్ట క్రాస్‌రోడ్ - గార్లగడ్డ తండా డబుల్‌రోడ్డు, గోవర్ధనగిరి - చిలుపూర్ గుట్ట, చిన్నపెండ్యాల - తరిగొప్పులతో పాటు, గిరిజన తండాలకు రోడ్డు సౌకర్యం నిమిత్తం రూ 2.95 కోట్లు మంజూరైన సందర్భంగా మండలంలోని పల్లగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిల ఫ్లెక్సీకి పూలు, పాలతో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ, 32 ఏళ్ళ క్రితం నిర్మించిన పల్లగుట్ట రోడ్డును గత పాలకులు ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదని, ఇన్నాళ్ళూ గుంతల రోడ్లతో ఇబ్బందులు పడ్డ తమకు కడియం ప్రత్యేక చొరవతో డబుల్‌రోడ్డు మంజూరైందన్నారు. గిరిజనతండాల అభివృద్ధి కడియంకే సాధ్యమన్నారు. తండాలు, ఎస్సీకాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ ద్వారా మరో 1. 88 కోట్ల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, బొమ్మి శెట్టి బాలరాజు, ఎన్నకూస కుమార్, ఏడవెళ్లి మల్లారెడ్డి, స్వామినాయక్, డైరెక్టర్లు రత్నాకర్‌రెడ్డి, పేరాల సుధాకర్, ఇస్సాకు, చేరాలు పాల్గొన్నారు.

● రఘునాథపల్లి : స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ సంపూర్ణ అభివృద్ధి కోసం రూ.1388 కోట్ల నిధులు తీసుకొచ్చిన ఘనత ఎమ్మెల్యే కడియం శ్రీహరికే దక్కుతుందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో శనివారం నియోజకవర్గ పరిధిలోని ఆర్అండ్‌బీ, పీఆర్ హ్యామ్ రోడ్ల అభివృద్ధికి గాను రూ.330 కోట్లు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, అందుకు సహకరించిన ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబుతో పాటు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చందర్ రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ఎండి.బాషుమియా, పర్శ సిద్దేశ్, తోటకూరి రమేష్, నాయకులు గాదె మహేందర్ రెడ్డి, మేకల నరేందర్, కావటి భాస్కర్, తాటికొండ వెంకటేష్ యాదవ్, మహ్మద్ అబ్బాస్ మియా, లోనె శ్రావణ్ కుమార్, గొరిగె రవి, చెంచు రమేష్, కడారి రవి, మాల్య నాయక్ పాల్గొన్నారు.


రఘునాథపల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారజోడు రాంబాబు


మాట్లాడుతున్న చిలుపూర్ గుట్ట దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు